## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



మాజీ ఎమ్మెల్యేను కలిసిన జెడ్పీటీసీ కుటుంబం

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు కుటుంబానికి తాము రుణపడి ఉంటామని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నిట్టా గంగరాజు, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం అన్నారు. తమ కుటుంబంలో ఉప సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా కొన్ని అవకాశాలు కల్పించి ప్రోత్సహించిన విధానం ఎన్నటికీ మరువలేమని వారు అన్నారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. శుక్రవారం అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయంలో గంగరాజు కుటుంబ సభ్యులు ఆయన్ను కలిశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారి వెంట కుమార్తె అన్షు ఉన్నారు.

### ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



నిల్వ ఉన్న నీటిని తొలగింపు చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: మారుతున్న వాతావరణం పరిస్థితులు కనుగుణంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం కొవ్వలి ఫ్రైడే–డ్రైడేలో భాగంగా ఇంటింటా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ సీసాలు, బకెట్లు టైర్లలో నీరు నిల్వ ఉంచొద్దన్నారు. మురుగునీరు దిగు ప్రాంతానికి వెళ్లేలా చూసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా సమీప వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ హరి, ఏఎన్‌ఎం సరిత, సీహెచ్‌ఓ నాగలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### దాతల సేవలు అభినందనీయం



దాతలను సత్కరిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం

భీమడోలు: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో దాతల సేవలు అభినందనీయమని భీమడోలు ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో శుక్రవారం ముగ్గురు దాతలు 100 మంది విద్యార్థులకు రూ.15వేల విలువ గల భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ పొల్నాటి శ్రీనివాస్, పెద్ద అన్నేం రాంబాబుల ఆర్థిక సాయంతో ఎండీఎం ప్లేట్లను అందించారు. హెచ్‌ఎం ఎస్‌కొండయ్య అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు మట్లాడుతూ పాఠశాలలకు దాతలు, గ్రామ పెద్దలు సహాయ సహకారాలను అందిస్తే మరింత అభివృద్ధిని సాధిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, టీచర్లు పాల్గొన్నారు.

### డిజైన్ స్పెషలైజేషన్‌లో డాక్టరేట్



డాక్టరేట్ సర్టిఫికెట్‌తో పిల్లా కార్తీక్

ఉంగుటూరు: ముంబయి ఐఐటీలో మెకానికల్ డిజైన్ స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ పూర్తిచేసిన ఉంగుటూరుకు చెందిన పిల్లా కార్తీక్‌కి ఇటీవల నిర్వహించిన స్నాతకోత్సవంలో డాక్టరేట్‌ను అందజేశారు. శుక్రవారం ఓ ప్రకటనలో కార్తీక్ ఈ విషయం వెల్లడించారు.

### బాల్య వివాహాలను అరికట్టాలి

బుట్టాయగూడెం: పిల్లలకు బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అచ్యుత శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిషేధంపై ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

# నీటమునిగిన పంటలకు పరిహారం దక్కేనా?



ఉంగుటూరు : దొంతవరం ఆయకట్టులో పాడైపోయిన పంట చేలు



దెందులూరు: వర్షపు నీటిలో మునిగిన ఆయిల్‌పామ్ తోట

- రెండువేల ఎకరాల్లో పంట నష్టం
- రైతుల ఆందోళన.. ఆదుకోవాలని వేడుకోలు

ఉంగుటూరు: మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంట చేలు పాడైపోయాయి. వరి దుబ్బులు దెబ్బతిన్నాయి. తిరిగి కోలుకోలేని విధంగా మునిగిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉంగుటూరు మండలంలో సుమారు రెండు వేలు ఎకరాలకు పైనే వరి పంట ఈ అధిక వర్షాలకు దెబ్బతింది. కాకర్లమూడి, వీపీపురం, దొంతవరం, రావులపర్రు, కైకరం శివారు, వెల్లమిల్లి గ్రామాల్లో పంట కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందా అనే సందిగ్ధంలో రైతులు కొట్టిమిట్టాడుతున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పంట మునిగిపోయిన సమయానికి కాలం సరిపోతుందా లేదా అనేది తెలియడం లేదు. దీంతో అధికారులు మాత్రం ముంపుకు గురై పంట కోల్పోయిన రైతులను గుర్తించే పనిలో ఉన్నారు. మండలంలో అయితే సుమారు 4 వేలు ఎకరాలు వరి పంట నీట మునిగింది. రెండు వేల ఎకరాల్లో నీరు లాగడంతో మూనలు తిరిగి బతికాయి. వాటికి మందులు వేసుకొని బతికించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఎంత వరకు పంట పండుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. నాట్లు వేసిన 20 నుంచి 25 రోజుల కాల పరిమితిలో పంట చేలు మునిగిపోయాయి. అప్పటికే ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టేశారు. దుక్కి దున్ని నాట్లు వేయడానికి, కలుపు తీయించేందుకు, తొలి కోటా మందు వేసేందుకు ఖర్చు చేశారు. ఇంత పెట్టుబడి పెట్టాక పంట సుమారు 20 రోజులు మునిగిపోయి పనికిరాకుండా పోయింది. ఒక్క కాకర్లమూడి ఆయకట్టులో 900 ఎకరాలు దెబ్బతిందని ఆ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షంతో తప్పని ఇబ్బందులు**

చేబ్రోలు రైల్వే అండర్ పాస్‌లోకి వర్షం నీరు రావడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, కార్లపై వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు అండర్ టన్నెల్ వద్ద నీరు భారీగా చేరింది. దీంతో దూబచర్ల వైపు వెళ్లే వారు అటు నుంచి జాతీయ రహదారి మీదకు చేరే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**నీటమునిగిన ఆయిల్‌పామ్ తోటలు**

దెందులూరు: మెట్ట గ్రామాల్లో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయిల్‌పామ్ తోటలకు వర్షపు నీరు చేరింది. గతంలో ఎప్పుడూ ఆయిల్‌పామ్ తోటలకు వర్షపు నీరు చేరి మొక్కలు మునిగిన దాఖలాలు లేవు. గిట్టుబాటు ధర లేక కూలీల ధర అమాంతంగా పెరిగిపోయి అంతంత మాత్రంగా ఉన్న ఆయిల్‌పామ్ రైతుల నెత్తిన నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం పిడుగు మాదిరిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, హార్టికల్చర్ శాఖల అధికారులు, శ్రీరామవరం, జోగన్నపాలెం గ్రామాల్లో నీటమునిగిన పంటలను పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

**చాలా నష్టపోయాం**



ఇంతగా ఎప్పుడూ నష్టపోలేదు. నేను నాలుగు ఎకరాలు సాగు చేశాను. పెద్దఎత్తున కురిసిన వర్షానికి చుట్టూ ఉన్న మురుగు డ్రెయిన్లు నీరు లాగకపోవడంతో పంట చేలు ముంపునకు గురయ్యాయి. నేను వ్యక్తిగతంగా రూ.1 లక్ష పెట్టుబడి పెట్టాను. ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి. తిరిగి నాట్లు వేసుకోవడానికి కాల పరిమితి చాలదు. నాలా గ్రామంలో చాలా మంది రైతులు నష్టపోయారు.

– రాజాని దుర్గారావు, కాకర్లమూడి, రైతు

**ప్రభుత్వానికి నివేదిస్తాం**

వరిసాగుకు అధిక వర్షాలకు దెబ్బతిన్న పొలాలను, నష్ట పోయిన రైతులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఎన్యుమిరేషన్ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. పెట్టుబడి పెట్టి నష్టపోయిన మాట వాస్తవమే. దీని మీద ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బట్టి రైతులకు సాయం ఆధారపడి ఉంటుంది. మండలంలో ప్రాథమిక సమాచారం ప్రకారం 1100 ఎకరాలు దెబ్బతిన్నట్లుగా గుర్తించాం.

– ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి, ఉంగుటూరు

### ఎరువులను ఈపోస్‌లోనే విక్రయించాలి



ఎరువుల బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్సై సీతారాముడు, ఏవో ఉషారాణి

భీమడోలు: కురెళ్లగూడెంలోని శ్రీకృష్ణ ట్రేడర్స్, ఉమాలక్ష్మీ ట్రేడర్స్ ఎరువులను శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్సై కె.సీతారాముడు ఆధ్వర్యంలో వ్యవసాయ, విజిలెన్స్ దుకాణాల్లోని స్టాక్, రిజిస్టర్లను పరిశీలించారు. ఇందులో శ్రీకృష్ణ ట్రేడర్స్‌కు చెందిన సింగిల్ సూపర్ పాస్ఫేట్ 140 బ్యాగులు సాంకేతిక సమస్య నేపథ్యంలో ఈపోస్ మిషన్‌లోకి రాకపోవడంతో వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. రూ.73,500 విలువ గల ఎరువులను వాటికి క్లియరెన్స్ వచ్చిన తరువాత సంబంధిత అనుమతులు పొంది విక్రయించాలని దుకాణదారుడిని ఆదేశించారు. అప్పటివరకు వ్యవసాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ తనిఖీల్లో ఏవో ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

కామవరపుకోట: గ్రామాల్లో పారిశుద్ధ్యని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ ఆదేశించారు. శుక్రవారం కామవరపుకోట మండలం కళ్ల చెరువు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. గ్రామంలో సమిత్వ సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సరళ కుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 2400 మంది నిరక్షరాస్యుల గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న వయోజన విద్య ప్రాజెక్టు అసిస్టెంట్ ఆఫీసర్ విజయకుమార్

దెందులూరు: 2,400 మంది నిరక్షరాస్యులను గుర్తించామని వారికి వలంటీర్లను నియమించి శిక్షణ ఇస్తున్నామని వయోజన విద్య ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఆఫీసర్ విజయకుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారి కె.శ్రీదేవి ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాంధ్ర–అక్షరాస్యతా కార్యక్రమంపై వలంటీర్లకు మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణా కార్యక్రమంపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. మండలంలో స్వయం సహాయక సంఘాల్లో 2400 మంది నిరక్షరాస్యులను గుర్తించి, మొత్తం మండలంలో 240 మంది వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. వీరికి సెప్టెంబర్ నుంచి మార్చి వరకు శిక్షణ ఇచ్చి అనంతరం పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. సమావేశంలో ఎంపీడీవో కే శ్రీదేవి మాట్లాడుతూ, ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంది, అవన్నీ సక్రమంగా ఉపయోగించుకోవాలంటే ప్రతి ఒక్కరికి అక్షరాస్యత అవసరమని, మండలంలో ఉన్నటువంటి నిరక్షరాస్యులు అందరూ అక్షరాస్యులుగా వాలంటీర్లు మార్చాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఏపీఎం పీ. సురేష్ కుమార్, మండల విద్యాశాఖాధికారి ప్రసాద్, ఐసీడీఎస్ పర్యవేక్షకులు చిట్టెమ్మ వాలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

## మేజర్ ధ్యాన్ చంద్ క్రీడా స్ఫూర్తి ఆదర్శనీయం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

దెందులూరు: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని గోపన్నపాలెం ప్రభుత్వం వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేలు అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన ఏక్ గంట ఏక్ మైదాన్ మైన్ ఒక గంట ఆట మైదానంలో అనే నినాదంతో క్రీడలు ఫిట్‌నెస్ ప్రాముఖ్యతపై గత మూడు రోజులుగా వ్యాసరచన పోటీలు నిర్వహించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వై.పోల్‌రెడ్డి పాల్గొన్నారు.

### వరిలో ఎరువుల నిర్వహణ ముఖ్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పెదవేగి: వరి పంటలో ఎరువుల నిర్వహణ ముఖ్యమని శాస్త్రవేత్త ఫణికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదకడిమిలో రైతుల పొలంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ శాస్త్రవేత్త ఫణీకుమార్, ఏడీహెచ్ సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ వరి పంటలో నత్రజని ఎరువుగా యూరియా బదులు అమోనియం సల్ఫేట్ వాడుకోవచ్చని వివరించారు. అమోనియం సల్ఫేట్ వాడితే పంటకు నత్రజనితో పాటు గంధకం (సల్ఫర్) కూడా లభిస్తుందని తెలిపారు. ఏడిహెచ్ సంతోష్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల మోతాదు నిర్ణయించుకోవాలని సూచించారు. రైతుల ప్రశ్నలు, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొసరాజు బాలరామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు కొసరాజు వీరవెంకట వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు



దెందులూరు: స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చౌదరి



భీమడోలు: ప్రత్యేక అలంకరణలో గణనాథుడు

దెందులూరు: వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలు భక్తశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి, గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, మాజీ ఎంపీటీసీ బత్రాజు సత్యనారాయణ, భక్తులు, గ్రామస్తులు పోతునూరు సాయిబాబా గుడి రోడ్డులో వినాయక స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గోపన్నపాలెంలో శ్రీబాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్లు మోదుగు యశ్వంత్‌కుమార్, కర్రి శ్రీరామ్ కమిటీ సభ్యులు 3న జరిగే ఊరేగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం**

భీమడోలు: భీమడోలు గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాథుని 61వ వార్షికోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మూడో రోజు శుక్రవారం స్వామి వారు భక్తులకు సంప్రదాయ పసుపు వర్ణంలో దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజూ ఒక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మండల వ్యాప్తంగా భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, పోలసానిపల్లి, కొల్లేరు గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

# తెలుగు భాషకు కాదేదీ సాటి



దెందులూరు: తెలుగు ఉపాధ్యాయులను సత్కరించిన హెచ్‌ఎం శర్మ



గణపవరం: డిగ్రీ కాలేజీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు





నిడమర్రు: విద్యార్థులకు హుమతులు అందజేస్తున్న లయన్స్ సభ్యులు



పెదవేగి: గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు



భీమడోలు: పొలసానిపల్లిలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

దెందులూరు: దేశ భాషలందు తెలుగు లెస్స అని, తెలుగు భాషకు కాదేదీ సాటి అని కొవ్వలి ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎన్ వీజీ శర్మ అన్నారు. శుక్రవారం కొవ్వలి ఉన్నత పాఠశాల, పోతునూరు, దెందులూరు, గోపన్నపాలెం పాఠశాలల్లో మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో తెలుగు తల్లి చిత్రపటానికి హెచ్‌ఎం శర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, ఎ.చంద్రరేఖ, ఎం.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**తెలుగు భాష ఔనత్యాన్ని కాపాడాలి**

పెదపాడు: ఏ దేశ మేగినా ఎందు కాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని అంటూ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు సందేశాన్ని అందించారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు బాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడాలని తెలిపారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**మాతృ భాషను మరువకూడదు**

పెదవేగి: ఎంత ఎత్తుకి ఎదిగినా మాతృ భాషను మరువకూడదని కొప్పాక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.శైలజ అన్నారు. మండలంలోని కొప్పాకలో శుక్రవారం మాతృ భాషా దినోత్సవం, నేషనల్ స్పోర్ట్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు భాషా పరిరక్షణ సమితి పెరవలి ఆధ్వర్యంలో 105మంది విద్యార్థులతో 100 తెలుగు పద్యాలు పాడించి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కొప్పాక విద్యార్థులను భాగస్వాములను చేయించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రధానంచేశారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా రామచంద్రపురం ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు బి.మోహన్‌రావు, సీహెచ్ దుర్గ, కె.నిర్మలకుమారి, పీడీలు ఎం.మల్లికార్జున్, బి.దుర్గారాణి, హెచ్‌ఎంలు కె.శ్రీనివాసరావు, గుగులోతు కృష్ణ, తెలుగు ఉపాధ్యాయులు అశోక్ పాల్గొన్నారు.

**గిడుగు రామ్మూర్తి కృషి ఆదర్శప్రాయం**

గణపవరం: వ్యవహారికభాషను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి గిడుగురామమూరితపంతులు చేసిన కృషి ఆదర్శప్రాయమని, తెలుగు ఔన్నత్యాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మల కుమారి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం శుక్రవారం కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషోద్యమంలో పాల్గొన్న ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు తెలుగు భాషకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు, ప్రాచీన హోదా లభించాయన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ గణేష్ కుమార్, తెలుగుశాఖాధిపతి జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**తరాలు మారినా తరగని వన్నె తెలుగుకు సొంతం**

నిడమర్రు: ఎన్ని తరాలు మారుతున్నా తెలుగు భాష గొప్పదనం పెరుగుతుండే తప్ప ఎప్పటికీ తరగదని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కె.సత్యనారాయణ మూర్తి అన్నారు. శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా బువ్వనపల్లి హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనం ఎన్ని భాషలు నేర్చుకున్నా భావవ్యక్తీకరణకు తెలుగుభాష దోహదపడుతుందన్నారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సంకు ఏసుబాబు, సీహెచ్ భారతి, లయన్ ఎంఎల్ఎస్ నారాయణ పాల్గొన్నారు.

**తెలుగు భాషకు గిడుగు సేవలు చిరస్మరణీయం**

భీమడోలు: తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ప్రపంచ తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు ఆద్యుడు గిడుగు వెంకటరామ్మూర్తి, ధ్యాన్‌చంద్ సింగ్ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొలసానిపల్లి నంబర్–1 పాఠశాలలో చిన్నారులు తెలుగు తల్లి అవతారంలో చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.తులసి, టీచర్లు శేఖర్, వెంకటస్వామి, శ్రీనివాసరావు, విజయలక్ష్మీ, రాజమ్మ, హైందవి, శివజ్యోతి, అరుణ, మంగతాయారు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గ్రంథాలయ శాఖలు ఏర్పాటు చేయాలి

దెందులూరు: మండలంలో జిల్లా గ్రంథాలయ శాఖలు ఏర్పాటు చేయాలని మండలంలో విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు కోరుతున్నారు. మండలంలో ప్రస్తుతం దెందులూరు, పోతునూరు గ్రామాల్లో మాత్రమే గ్రంథాలయాలు ఉన్నాయి. గతంలో గోపన్నపాలెంలో గ్రంథాలయం ఉండేది భవనం శిథిలమై పుస్తకాలు పేపర్లు పాడైపోవడంతో గ్రంథాలయాన్ని తీసివేశారు. ప్రస్తుతం మండలంలో రెండే రెండు గ్రంథాలయాలు ఉన్నాయి. దెందులూరు ద్వారకాతిరుమల రోడ్డులో అన్ని గ్రామాలకు సెంటర్ గా రామారావుగూడెంలో ఏలూరు–జంగారెడ్డిగూడెం రోడ్డులో అన్ని గ్రామాలకు సెంటర్ గా గోపన్నపాలెం గ్రామాల్లో రెండు గ్రంథాలయాల బ్రాంచ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

### విధులు బాధ్యతగా నిర్వహించాలి



బదిలీ అయిన సిబ్బందిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: ఎక్కడ పనిచేసినా బాధ్యతగా విధులు నిర్వహిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.కిరణ్మయి, ఓంకార్‌నాథ్ అన్నారు. శుక్రవారం గణపవరం పీహెచ్‌సీలో ఇటీవల బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లిన సిబ్బందిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నూకాలమ్మ ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. పట్టణానికి చెందిన చామర్తి శ్రీరాములు రూ.10,116, యరకారెడ్డి వెంకటరెడ్డి (గండేపల్లి) రూ.5,116 ఆలయ అభివృద్ధికి విరాళంగా అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. చిట్లూరి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.